# గజవాహనంపై ఊరేగిన శ్రీవారు

**గోవింద నామస్మరణతో మారుమ్రోగిన చింతలూరు**

**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 09;** చింతలూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి విశేష ఉత్సవంగా వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం గంధోత్సవం, శ్రీ వేంకటేశ్వర వ్రతం, ఆయుష్మ హోమం,అయనోత్సవం, డోలోత్సవం నిర్వహించారు. వాహన సేవలో భాగంగా స్వామివారి యోగ స్వరూపుడై గజవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. వాహనోత్సవంలో పాల్గొనడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. చింతలూరు గోవింద నామస్మరణతో మారుమ్రోగింది.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేధ్కర్ కోనసీమ జిల్లా

# గ్రామీణాభివృద్ధికి బలమైన అడుగులు

**రూ.41.50 లక్షలతో సీసీ రోడ్లకు మంత్రి సుభాష్ శంకుస్థాపనలు**



**రామచంద్రపురం / కె.గంగవరం, ఫిబ్రవరి 9:** రామచంద్రపురం నియోజవర్గంలో గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కీలక చర్యలు చేపడుతున్నారు. సోమవారం మొత్తం రూ. 41.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న పలు సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపనలు చేశారు. రామచంద్రపురం మండలం ఏరుపల్లి గ్రామంలోరూ. 13.50 లక్షలు, ఉట్రుమిల్లి గ్రామంలో రూ. 12.50 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనుండగా, కె.గంగవరం మండలం దంగేరు గ్రామంలో రెండు రోడ్లను రూ. 15.50 లక్షలతో చేపట్టనున్నారు. ఈ పనులతో గ్రామాలకు శాశ్వత రహదారి సదుపాయాలు కలుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని, నాణ్యమైన రహదారులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని అన్నారు. అభివృద్ధి పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ యేసురత్నం, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఏళ్ల తరబడి రోడ్లు లేక ఇబ్బందులు పడిన గ్రామాల ప్రజలు ఈ అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేశారు.

# రామచంద్రపురం నియోజకవర్గానికి 11వ ర్యాంకు

**రామచంద్రపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 9:** రాష్ట్ర ప్రభుత్వం 175 నియోజకవర్గాలకు ర్యాంకులు ప్రకటించిన నేపథ్యంలో, 108 కీలక సూచికల ఆధారంగా మార్కులు కేటాయించగా రామచంద్రపురం నియోజకవర్గం 91 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 11వ స్థానంలో నిలిచింది. ఈ ర్యాంక్ రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధిలో సాధించిన పురోగతికి నిదర్శనమని పలువురు పేర్కొంటు న్నారు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వానికి ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ స్పందిస్తూ ఇది ప్రజల ఆశీర్వాదం, అధికారుల సమన్వయం, ప్రభుత్వ విధానాల సమర్థ అమలుకు వచ్చిన ఫలితమని అన్నారు. భవిష్యత్తులో మరింత కృషి చేసి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు పనిచేస్తామని తెలిపారు.



# కోనసీమ తిరుమల వాడపల్లిలో గోవిందమాల ధారణ రజతోత్సవం

**భక్తిశ్రద్ధలతో నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు**



**ఆత్రేయపురం పెన్ పవర్, ఫిబ్రవరి 9:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీభూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దివ్య క్షేత్రంలో శ్రీ గోవిందమాల ధారణ రజతోత్సవం సందర్భంగా విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్వామివారి అనుగ్రహం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ పాలకవర్గం పిలుపునిచ్చింది. ఈ రజతోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో జ్యోతి స్వరూపార్చన, కోటి దీపోత్సవం, మహా పుష్పయాగం వంటి పవిత్ర కార్యక్రమాలు అత్యంత భక్తి వాతావరణంలో జరగనున్నాయి. దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం దివ్యంగా వెలుగొందనుండగా, కోటి దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు ప్రత్యేక పుణ్యఫలం లభిస్తుందని వేద పండితులు తెలిపారు. అదేవిధంగా శ్రీ వేంకటేశ్వర వైభవం అంశంపై ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావు ప్రవచన కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక లోకానికి తీసుకెళ్లనుంది. స్వామివారి మహిమ, లీలలు, భక్తులపై కురిపించే కరుణను ఈ ప్రవచనంలో విశదీకరించనున్నారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవం ఫిబ్రవరి 10, 2026 (మంగళవారం) సాయంత్రం 5 గంటల నుంచి శ్రీవారి కళ్యాణ ప్రాంగణం (పార్కింగ్ ప్రాంతం) నందు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల రాకపోకలకు, దర్శనానికి, ప్రసాద పంపిణీకి తగిన చర్యలు చేపట్టారు. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కృపతో కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యాలు, సకల శుభాలు కలుగుతాయని నమ్మకం ఉందని, ఈ పవిత్ర కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ అధికారులు, వేద పండితులు భక్తులను కోరారు. కోనసీమ ప్రాంతంతో పాటు పరిసర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశముందని తెలిపారు.



# మహాశివరాత్రి పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి సుభాష్

**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం**



**రామచంద్రపురం/కె.గంగవరం పెన్ పవర్, ఫిబ్రవరి 9:** మండల పరిధిలోని కోటిపల్లి గ్రామంలోని శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆవిష్కరించారు. శివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనాలు సక్రమంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. అంతకు ముందు మంత్రి ఆలయంలో శంఖం పూరించి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు రేవు శీను, మురళి, ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరం, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# ఊబలంక లో లారీ ఢీకొని వృద్ధుడు మృతి



**రావులపాలెం, పెన్ పవర్ ఫిబ్రవరి 9:** రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందినట్లు రావులపాలెం ఎస్సై కేవీ రమణారెడ్డి తెలిపారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో ఊబలంక గ్రామానికి చెందిన బండారు వె రియ్య (79) టీ త్రాగడానికి ఊబలంక సెంటర్‌కు వచ్చారని చెప్పారు. అనంతరం కనకమహాలక్ష్మి గుడి సమీపానికి చేరుకున్న సమయంలో రావులపాలెం నుంచి ఆత్రేయపురం వైపు వెళ్తున్న ఏపీ 39 డబ్ల్యూజీ 3639 నంబర్ గల లారీని డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపి ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుని కుమారుడు బండారు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కె.వి.రమణారెడ్డి వెల్లడించారు.

# త్రాగునీటి వృథాపై కఠిన చర్యలు



**కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ హెచ్చరిక**

**కాకినాడ, పెన్ పవర్,ఫిబ్రవరి 9:** వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని నగర ప్రజలు త్రాగునీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ పిలుపునిచ్చారు. నీటిని నిర్లక్ష్యంగా వృథా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సోమవారం ఉదయం నగరంలోని 6, 7 డివిజన్లలో పర్యటించిన కమిషనర్ స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. స్పీడ్ బ్రేకర్లు, డ్రైనేజీ అభివృద్ధి, వీధి కుక్కల నియంత్రణ, చెత్త సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పర్యటనలో ఒక మహిళ త్రాగునీటి కుళాయికి పైపు కట్టి రోడ్డు శుభ్రం చేస్తుండటాన్ని గమనించిన కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసి, సంబంధిత ఇంటికి రెండు రోజుల పాటు నీటి సరఫరాను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నగరంలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డివిజన్ స్థాయిలో పర్యటనలు కొనసాగిస్తున్నామని తెలిపారు. స్థానిక పార్కులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.




# రాష్ట్ర సచివాలయంలో మంత్రులుకార్యదర్శుల సమీక్షా సమావేశం



వర్చువల్‌గా పాల్గొన్న కాకినాడ జిల్లా అధికారులు



**కాకినాడ, పెన్ పవర్, ఫిబ్రవరి 9:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు,కార్యదర్శు లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాకినాడ నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్,జిల్లా ఎస్పీ బిందు మాధవ్,జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను నెలలవారీగా సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలో వేగంగా అమలు జరిగేలా జిల్లా కలెక్టర్లు, ఇన్‌చార్జ్ మంత్రులు పర్యవేక్షించాలని సూచించారు. సంక్షేమం,అభివృద్ధి, సుపరిపాలనకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రైతులకు అన్నదాత సుఖీభవం, దీపం 2.0, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాల ద్వారా భారీగా ఆర్థిక సహాయం అందించామని వివరించారు. క్వాంటం వ్యాలీ, డేటా సెంటర్లు, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులు, సాగునీటి వ్యయాలు, రోడ్ల నిర్మాణం, పల్లె పండుగ, ఉద్యోగావ కాశాలు, జల్ జీవన్ మిషన్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించారు. అమరావతిని మోస్ట్ లివబుల్ సిటీగా తీర్చిదిద్దుతామని, పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలోకి వచ్చిందని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిరంతరం సమీక్ష చేస్తున్నామని తెలిపారు. గ్రామీణా భివృద్ధి, తాగునీటి పథకాలు, అటవీ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నిధుల కొరత ఉన్నప్పటికీ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని సూచించారు.

## జనార్ధన స్వామి ఆలయానికి పోటెత్తిన యాత్రికులు



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 09;**నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన నారద ప్రతిష్టిత ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయానికి సోమవారం యాత్రికులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు వారికి సాదర స్వాగతం పలికారు. వారంతా స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు స్వామివారి వైభవాన్ని, ఆలయ చారిత్రక నేపథ్యాన్ని ప్రజలకు వివరించారు. ఆలయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్న ఆలయ చైర్మన్, సభ్యులను యాత్రికులు అభినందించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఓపెన్ డే



**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 9**: జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఓపెన్ డే కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల మరియు ఇతర జూనియర్ కళాశాలల రెండవ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ కళాశాలలో అందుబాటులో ఉన్న బి.ఏ., బి.కాం., బి.ఎస్సి. తదితర కోర్సులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, సౌకర్యవంతమైన తరగతి గదులు, సమగ్ర ప్రయోగశాలలు, గ్రంథాలయం మరియు విద్యార్థుల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా పథకాలు మరియు ఉపకార వేతనాల గురించి కూడా తెలియజేశారు. విద్యార్థులు కళాశాలలోని వివిధ విభాగాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్లు మరియు ఇతర మౌలిక సదుపాయాలను సందర్శించి అవగాహన పొందారు. ఆయా విభాగాల అధ్యాపకులు అందుబాటులో ఉన్న కోర్సులు, భవిష్యత్ ఉపాధి అవకాశాలు మరియు ఉన్నత విద్య అవకాశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలల నుండి విచ్చేసిన అధ్యాపకులు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, లబోరేటరీలు, డిజిటల్ తరగతి గదులు నేటితరం విధ్యావిదానం ఆచరిస్తూ విధ్యను అందిస్తున్న ఈ కళాశాల అధ్యాపకులకు శిరస్సువంచి నమస్కరిస్తూ విధ్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సి. హెచ్ బాలరాజు, ఐ. క్యూ.ఏ.సి కో-ఆర్డినేటర్ పి.వి.వి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బండారు ను కలిసిన రాజ్యసభ సభ్యులు కోడూరి వెంకట విజయేంద్ర ప్రసాద్

పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా ఆక్సిజన్ మొక్క బహూకరణ



**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి9:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పర్యటన సందర్భంగా గౌరవ రాజ్యసభ సభ్యులు, ప్రముఖ సినీ రచయిత కోడూరి వెంకట విజయేంద్ర ప్రసాద్‌తో స్నేహపూర్వక భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు ఆయనకు దుస్సాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పేర్కొంటూ, ఆ దిశగా ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో ఆక్సిజన్ మొక్కను విజయేంద్ర ప్రసాద్‌కు బహూకరించారు. ప్రజాప్రతినిధులు పర్యావరణాన్ని కాపాడే కార్యక్రమాల్లో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ర్యాలి గ్రామంలోని జగన్మోహిని కేశవ & గోపాల స్వామి ఆలయ దర్శనం తనకు ఆధ్యాత్మిక ప్రశాంతతను కలిగించిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని ఈ భేటీని విజయవంతం చేశారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో రొయ్యల సాగులో నీటి నాణ్యతపై అవగాహనా సదస్సు



**కాకినాడ, పెన్ పవర్,ఫిబ్రవరి 9:**లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలు (స్వయం ప్రతిపత్తి) ఫిషరీస్, ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు "రొయ్యల సాగులో నీటి నాణ్యత నిర్వహణ ప్రాముఖ్యత" అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించినట్లు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎఫ్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. రాజ్‌కుమార్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని, నీటి నాణ్యత నిర్వహణ, జీవ భద్రత చర్యలు, రోగ నివారణ పద్ధతులు, ఆధునిక రొయ్యల సాగు సాంకేతికతపై విద్యార్థులకు విశదీకరించారు. సంస్థ డిస్ట్రిక్ట్ మేనేజర్ సురేష్ పరిశ్రమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమం మత్స్యఆక్వాకల్చర్ విభాగాధిపతి డా. కె.ఎన్. మూర్తి పర్యవేక్షణలో నిర్వహించబడింది. కార్యక్రమాన్ని నిర్వహించిన ఫిషరీస్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.

# ఇర్రిపాకలో అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం





**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 9:** జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఈనెల 7,8 ,9 తేదీలలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా 9వ తేదీ ఆఖరి రోజు సోమవారం శ్రీశైలం భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి వారి దివ్య కళ్యాణం, శ్రీశైలం మల్లికార్జున స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీశైలం నుండి తీసుకొచ్చిన ఉత్సవ విగ్రహాలకు అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. శివనామస్మరణతో మారుమోగిన ఇర్రిపాక శివ కేశవుల క్షేత్రం ఆ పరమశివుడి ప్రతిరూపం శివలింగానికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవాలు శ్రీశైలం మల్లికార్జున స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో జరపగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంపతుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ శివ కేశవుల క్షేత్రంలో మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా శ్రీనివాసుడి, సత్య దేవుడిని కళ్యాణాలు నిర్వహించుకుని ఆఖరి రోజు సోమవారం శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి వారి దివ్య కళ్యాణం నిర్వహించామన్నారు. ఆ స్వామివారి కృప కటాక్షాలు మనందరి పైన ఉండాలని ఈ మహత్కార్యాన్ని తలపెట్టడం జరిగిందని నా జీవితాశయం కోటి లింగేశ్వరుని ప్రతిష్ఠ అన్నారు. వేలాదిగా హాజరైన భక్తులందరికీ శ్రీశైలం మల్లికార్జున స్వామి వారి ప్రసాదం పాకెట్స్ పంపిణీ చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కుటమి నాయకులు, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

## ఈ నెల 12న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి.

-సిపిఐ ఎంఎల్ రెబరేషన్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులో భారీ ర్యాలీ.






**కిర్లంపూడి/ప్రత్తిపాడు, ఫిబ్రవరి 09:**ఈనెల 12 న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని, 25 న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండలంలోని పేదలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్తిపాడులో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ సూర్యప్రభ కు అందజేశారు. ప్రధానంగా 12 జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్పొరేట్లకు అనుకూలంగా ఫాసిస్ట్ మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, విబి రాంజీ పథకాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ను యధావిధిగా కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయకుండా నిలిపివేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, స్వామినాథ సిఫార్సులను అమలు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ ఆపాలని, 12 గంటల పని దినాన్ని రద్దుచేసి ఎనిమిది గంటల పని దినాన్ని యధావిధిగా కొనసాగించాలని, కోరుతూ సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు మాట్లాడారు. దేశ సంపదను అంబానీ ఆదాని లాంటి కార్పొరేట్లకు అప్పచెప్పే విధంగా భవిష్యత్తులో పేదలు మరింత పేదలుగా మిగిలి పొట్టకూటికోసం సుదూర ప్రాంతాలకు వలస పోయే విధంగా కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు తన విధానాలని ప్రజల మీద రుద్దుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ లిపరేషన్ జిల్లా కార్యదర్శి కె జనార్ధన్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డి హరినాథ్, ఏగుపాటి అర్జనరావు, మానుకొండ లచ్చబాబు, జిల్లా కమిటీ సభ్యులు తాడి నాగేశ్వరరావు, రాజాల రత్నం ఈరటా నాగ సూర్య కుమారి, చిన్నం అర్జునుడు, బీరా దేవతయ్య, వరికూటి లోవమ్మ, బండి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సోమరాజుపేట రామాలయంలో సప్త సప్తాహ మహోత్సవాలు



**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 09:**కిర్లంపూడి మండలం, జగపతినగరం గ్రామం లో సోమరాజుపేట రామాలయం వద్ద సప్త సప్తహా మహోత్సవాలు రామాలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సప్తసప్తాహ మహోత్సవ కార్యక్రమాన్ని పరిష్కరించుకుని రామాలయంలో నిర్వహిస్తున్న భజన కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్ కుమారుడు తోట వరుణ్ పాల్గొన్నారు. స్వామి వారి ఆశీస్సులు తీసుకోవడమే కాకుండా, భజన కార్యక్రమంలో భజన మండలి సభ్యులు ఆలపించిన భక్తి గీతాలను వినసొంపుగా ఆలకించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీపీ కోడెల నల్లబ్బాయి, కపిలవాయి సూరిబాబు, ఆడారి నానాజీ, లక్కోజు కోటి, పోతుల శివాజీ పలువురు తోట నవీన్ అభిమానులు, రామాలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## నూతన డీఆర్ఓ టి. తిప్పేనాయక్‌కు కలెక్టర్, ఎస్పీతో మర్యాదపూర్వక భేటీ



**కాకినాడ, పెన్ పవర్, ఫిబ్రవరి 9:**కాకినాడ జిల్లా నూతన రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన టి. తిప్పేనాయక్ సోమవారం ఉదయం కాకినాడ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ , జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు.

## డీఆర్ఓ టి. తిప్పేనాయక్‌కు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో భేటీ



**కాకినాడ, పెన్ పవర్, ఫిబ్రవరి 9:**కాకినాడ జిల్లా డీఆర్ఓగా బాధ్యతలు చేపట్టిన టి. తిప్పేనాయక్ సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## శ్మశాన స్థలం కోసం దమ్ముపేట వాసుల పోరు



**పెద్దాపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 9**: పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులోని దమ్ముపేటలో శ్మశానవాటిక స్థలం కోసం దశాబ్దాలుగా సాగుతున్న పోరాటం సోమవారం మరోసారి ఉధృత రూపం దాల్చింది. సోమవారం దమ్ము సింహాచలం అనే మరో మహిళ మరణించడంతో గ్రామస్తులకు సహనం నశించి మృతదేహంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి మరణించాక మట్టిలో కలిసేందుకు ఆరడుగుల నేల కూడా దొరకని దౌర్భాగ్య స్థితిలో దమ్ముపేట ఉందని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత వారం పాలిక సింహాచలం అనే మహిళ మరణించినప్పుడు స్థానిక ఆర్డీఓకు విన్నవించినా ఫలితం శూన్యమని అన్నారు. శ్మశాన స్థలం ఎప్పుడు కేటాయిస్తారని అధికారులను నిలదీశారు. 150 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో మృతదేహాలను ఎక్కడ దహనం చేయాలో తెలియక ప్రజలు నానాయాతన అనుభవిస్తున్నారని ఏఐఎఫ్టీయూ నేత కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ నేత కె. సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని వారు తీవ్రంగా హెచ్చరించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

